20042024-MAI-04_Layout 1 4/20/2024 3:50 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎంత దూరం!

బి.నర్సన్
94401 28169

రాష్ట్రంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన నిమిత్తం మార్చి 5న ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్‌కు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ఆయనతో వేదికను పంచుకుంటూ అన్న మాటలు కొత్త అంచనాలకు తావిచ్చాయి. తన ప్రసంగంలో రేవంత్‌రెడ్డి ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ మొదటి మాట గానే 'ప్రధానమంత్రి అంటే పెద్దన్న. ప్రధాని సాయం లేకుండా రాష్ట్రాలు ఎదగలేవు' అని అన్నారు. బీజేపీయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులందరి తరపున వకాల్తా పుచ్చుకొన్నట్టు ఆయన అలా మాట్లాడటం విచిత్రంగా ఉన్నది. విపక్ష పాలిత రాష్ట్రాలు మోదీని సవాలు చేస్తుంటే రేవంత్ మాత్రం పెద్దన్న అని సంబోధించడం వెనుక దిగజారుడుతనముంది. ఇద్దరి మధ్య వ్యక్తిగత బంధాన్ని మరింత బలంగా మార్చుకోవాలనే ప్రయత్నం ఆయన మాటల వెనుక దాగున్నది.

పాలనాపరంగా దేశానికి ప్రధాని, రాష్ట్రానికి ముఖ్యమంత్రి పెద్ద. ఇది వ్యవస్థలో అంతర్భాగం. రాష్ట్రాలను సమదృష్టితో చూడాల్సిన బాధ్యత ప్రధానిది. బీజేపీయేతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానికి ఎలాంటి రాజకీయ వైషమ్యాలున్నా వాటిని పక్కనపెట్టి దేశ ప్రధాని హోదాలో ఆయన అందరినీ, అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలి. బీజేపీ పాలిత రాష్ట్రాలకే కాదు, దేశ ప్రజలందరికీ ఆయనే ప్రధాని. దేశవ్యాప్తంగా ఒకే రకమైన అభివృద్ధికి ఆయన పాటుపడాలి. అయితే అందుకు విరుద్ధంగా విపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టడం, నిధుల కేటాయింపులో వివక్ష చూపడం మోదీకి ఓ వినోద, వికృత క్రీడగా మారింది. దేశ ప్రధాని ముందు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గుజరాత్ ప్రస్తావన తీసుకురావడం మరో వింత. తెలంగాణలో గుజరాత్ తరహా అభివృద్ధికి కృషి చేస్తామని సభాముఖంగా రేవంత్ మాట్లాడటం కేవలం మోదీని మురిపించడానికే. గుజరాత్ రాష్ట్రమేమీ దేశానికి రోల్‌మాడల్ కాదు. అలాంటి అభివృద్ధే రేవంత్‌రెడ్డి కోరుకుని ఉంటే.. ఆయన ముందుగా కాంగ్రెస్ అధిష్ఠానంతో చర్చించాల్సింది.

అదే సభలో 'ప్రధాని కోరుకున్నట్టు దేశ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ల డాలర్లకు చేరుకోవాలని కోరుకుంటున్నాను' అని రేవంత్ రెడ్డి అనడం వెనుక మరో అర్థం దాగి ఉంది. భవిష్యత్తులోనూ మోదీ పాలనే కొనసాగాలని రేవంత్‌రెడ్డి పరోక్షంగా ఆశించినట్టే అవుతుంది. గుజరాత్‌లో సబర్మతి నదిని ప్రక్షాళన చేసినట్టు మూసీని స్వచ్ఛంగా మార్చేందుకు తోడ్పడాలని కూడా ప్రధానిని రేవంత్ కోరారు. అయితే సబర్మతి నది స్వచ్ఛతపై గతంలో రాజ్యసభలో చర్చ జరిగింది. సబర్మతిలోకి చేరే నీళ్లను శుద్ధి చేసే ప్లాంట్లను నిర్మించినప్పటికీ.. పారిశ్రామిక వాడల నుంచి వచ్చే రసాయన జలాలు శుద్ధి కాకుండానే నదిలోకి చేరుతున్నాయని, నగరంలోని మురికినీరు కూడా నదిలోకి వస్తున్నదని ఆ సందర్భంగా సభ్యులు తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రసంగం అనంతరం మోదీ ఆయనను మెచ్చుకోలుగా గట్టిగా కరచాలనం చేయడం మరో మెరుపు. అయితే అదే సభలో మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని తన ధోరణిలోనే కడిగిపారేశారు.

'మీరు మూడు పార్టీలు మారారు. మీ డీఎన్‌ఏలో ఏ పార్టీ ఉంది?' అని రేవంత్‌రెడ్డిని ఓ ఇంటర్వ్యూలో ఇండియా టుడే ప్రతినిధి ప్రశ్నించగా.. తెలంగాణ ప్రజల డీఎన్‌ఏ అని ఆయన సమాధానమిచ్చారు. తమ రాజకీయ జీవితం కాంగ్రెస్‌తోనే అని చాలా మంది కాంగ్రెస్ లీడర్లు చెప్పే లీతిలో రేవంత్ సమాధానం లేదు. ఈ లెక్కన ఆయన కాంగ్రెస్ బలహీనతను ఆసరాగా చేసుకుని నోరున్న నేతగా ఆ పార్టీలో చేరి, తన ఆకాంక్షలను నెరవేర్చుకున్నారని అనక తప్పదు.

నష్టాల్లో నడుస్తున్న కంపెనీని కొని కొందరు లాభాల్లోకి తెస్తారు. ఆ వ్యాపార చాతుర్యాన్నే ఆయన రాజకీయాల్లో చూపించారు. అందుకే రేవంత్ ప్రసంగాల్లో జనం పట్ల ప్రేమ కన్నా, బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిగత విమర్శలే ఎక్కువగా కనిపిస్తాయి. హుందాతనంతో వ్యవహరిస్తూ.. ఎందరో రాజనీతిజ్ఞులు కూర్చున్న ముఖ్యమంత్రి పీఠం గౌరవాన్ని కాపాడే బాధ్యత తనపై కూడా ఉన్నదనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గ్రహించాలి.

రాజకీయాలు నెరపడం కొందరికి జన్మతః వచ్చిన విద్య. అలాంటివారు గెలుపే లక్ష్యంగా ఎన్ని అడ్డదారులైనా తొక్కుతారు. పార్టీలు

వారి విజయానికి మెట్లలాంటివి. అలాంటివారు విజయం సాధించిన తర్వాత ఎక్కిన మెట్టును వదిలేసి మరో మెట్టు చూసుకుంటారు. చదువుకొనే రోజుల్లో విద్యార్థి పరిషత్ క్రియాశీల సభ్యుడిగా ఉన్న రేవంత్.. నిజానికి ఆ విద్యార్థి సంఘం శిక్షణ ప్రకారం తన సిద్ధాంతాన్ని వదులుకోకూడదు. రాజకీయాల్లో చేరాలని ఆయన అనుకొని ఉంటే బీజేపీలో కొనసాగాలి. కానీ, ఆయన సభ్యుడిగా ఉండే కన్నా శాసించేవాడిగా ఉండాలనుకున్నారు. రాజకీయంగా బీజేపీ బలహీనంగా ఉందని రేవంత్‌రెడ్డి భావించారు. అందుకే ఆ జెండా పట్టుకొంటే ఓట్లు రావని గ్రహించి స్వతంత్ర అభ్యర్థిగా 2006లో జడ్పీటీసీగా, 2007లో ఎమ్మెల్సీగా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత 2009లో టీడీపీలో చేరి ఎమ్మెల్యే అయ్యారు. తెలంగాణ వచ్చాక 2017లో అప్పటికే ఎన్నికల్లో దెబ్బతిన్న కాంగ్రెస్‌లోకి చేరారు. అలా దిక్కులేని కాంగ్రెస్‌ను ఆసరా చేసుకొని తన దుందుడుకు ధోరణితో ఆ పార్టీ పెద్దలను మెప్పించగలిగారు. సీనియర్లను పక్కకునెట్టి తొలుత పార్టీ అధ్యక్షుడిగా, మరో గంతేసి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అవ్వగలిగారు.

అయితే రేవంత్‌రెడ్డి గొంతుపై ఓటుకు నోటు కేసు కత్తిలా వేలాడుతోంది. 2015 మేలో ఏడాది వయసున్న తెలంగాణ ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు చంద్రబాబు పన్నిన కుట్రను అమలు చేస్తూ స్టింగ్ ఆపరేషన్‌లో ఆయన దొరికిపోయారన్న అభియోగమే ఆ కత్తికున్న పదును. నెల రోజుల కటకటాల జీవితం గడిపాక దొరికిన కండిషన్ బెయిల్‌పై ఆయన ప్రస్తుతం రాజకీయాల్లో కొనసాగుతున్నారు. అలా ఆయన జుట్టు మోదీ చేతిలో ఉంది. అందుకే మోదీ ముందు కీలుబొమ్మలా ఆడక తప్పడం లేదు. రాహుల్ గాంధీ మాట కన్నా మోదీ మాటనే ఇప్పుడు ఆయనకు ఎక్కువ. లోక్‌సభ ఎన్నికలయ్యాక మోదీ కొరడా ఝుళిపిస్తే.. బీజేపీ 'వాషింగ్ మెషిన్' బోనులోకి వెళ్లక తప్పదు. కూచున్న సీఎం సీటు భద్రంగా ఉండాలే గానీ ఆయనకు ఏ పార్టీ అయినా ఒక్కటే.

ఇక పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తెలంగాణలో అధిక స్థానాలు వస్తే కాంగ్రెస్ తెప్ప మునిగే కాలం వచ్చినట్టే. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ బీజేపీ ఎంపీలు విర్రవీగిపోతారు. రాష్ట్రాన్ని కూడా వారే పాలిస్తున్నట్టు బిల్డప్ ఇస్తారు. కాంగ్రెస్‌ను ముప్పుతిప్పలు పెడతారు. అదను చూసి మోదీ-షా ద్వయం రంగంలోకి దిగుతుంది. ప్రభుత్వాలను కూల్చడంలో వాళ్లు మహామాయగాళ్లు. పాలకపక్షాలను నిట్టనిలువుగా చీల్చిన కనికరం లేని చరిత్ర వారిది. 'కాంగ్రెస్సే మా ప్రాణం, ఊపిరి' అని భావించే పాత కాపులు తప్ప రేవంత్ బ్యాచ్ మొత్తం జంప్ కావచ్చు. తెలంగాణలో ఎక్కువ మంది బీజేపీ అభ్యర్థులు గెలిచేలా తెర వెనుక రాజకీయం నడుస్తోందని ఇప్పటికే కథనాలు వెలువడుతున్నాయి. ఏపీలో చంద్రబాబు కూటమి నెగ్గితే ఈ ప్రక్రియ మరింత వేగవంతం కావచ్చు. మొత్తానికి రేవంత్ చేజిక్కించుకున్న తెలంగాణ 'చేతి'లోనే ఉంటుందా? చేజారి చిక్కులపాలవుతుందా? అనేది కాలమే నిర్ణయిస్తుంది. జై తెలంగాణ నినాదాన్ని జనం మళ్లీ ఎత్తుకొని మట్టి గౌరవం కాపాడే సమయం ఇంకా ఎత్తిపోలేదు.

విజ్ఞులారా ఆలోచించండి!

'ప్రముఖులందరూ అత్యంత విమర్శలకు గురైనవారే' అన్న స్వామి వివేకానంద సూక్తి కె.చంద్రశేఖరరావుకు సరిగ్గా సరిపోతుంది. తెలంగాణ రాష్ట్ర సాధనలో సాగిన అవిశ్రాంత పోరాటం, స్వరాష్ట్రం కల సాకారమైన తర్వాత గత పదేండ్లలో సాధించిన తెలంగాణ ప్రగతి శాశ్వతమైనది. దీర్ఘకాలిక ప్రజా సంక్షేమానికి ఆధారభూతమైనది. తెలంగాణ రాష్ట్ర సాధనకు అస్తిత్వ తాత్విక పునాదులు, ప్రజాబలం ఎంత బలంగా ఉన్నప్పటికీ దీర్ఘకాలంగా చతికిలబడిన ఉద్యమాన్ని నిటారుగా నిలిపి రాష్ట్రాన్ని సాధించడంలో కేసీఆర్ పాత్ర అమోఘమైనదని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

కె.లక్ష్మణ్‌గౌడ్
97049 30509

ఊహకందని వ్యూహాలతో 14 ఏండ్ల పాటు ఉద్యమాన్ని సజీవంగా నిలిపి విమర్శలు, కువిమర్శల ధాటిని తట్టుకొని సర్వశక్తుల్ని సమీకరించి తన నాయకత్వ ప్రతిభను, ప్రతాపాన్ని కేసీఆర్ ప్రదర్శించిన తీరును శత్రువులైనా అంగీకరించి తీరాల్సిందే. కాలం మరుగునపడేసేంత అత్యంత అల్పమైన సంఘటన కాదు అది.

ఈ నేపథ్యంలో కేసీఆర్ అధికారాన్ని కోల్పోయిన తర్వాత పరిస్థితి అందరూ చూస్తున్నదే. ఇంతటి దారుణ పరిస్థితిలో కేసీఆర్ అత్యంత దూకుడుతో, రాష్ట్ర సాధన నాటి ప్రాణాపాయస్థితిని లెక్కచేయకుండా, తన సహజ లక్షణాన్ని పునరుజ్జీవింపజేసుకొని రంగప్రవేశం చేయడం ఒక అద్భుత, ఆశావహ దృక్పథం. సమకాలీన రాజకీయ రంగంలో ఈ స్థాయిలో ఆలోచించగలిగే, దుర్భర పరిస్థితులకు తట్టుకొని నిలిచి అరాచకాలను, అనాగరిక కుట్రల్ని ఛేదించి నిలువరించగలిగే సత్తా ఉన్న ఒకే ఒక్కడు కేసీఆర్. రాష్ట్రవ్యాప్తంగా దుర్భిణితో గాలించినా ఈ స్థాయి రాజకీయ చాతుర్యం, అవగాహనాసామర్థ్యం ఉన్న వ్యక్తి కనిపించరు. రాజకీయ కలుషిత వికారాల్ని భరిస్తూ.. నిశ్చలంగా, నిర్భయంగా, నిబ్బరంగా, సంయమనంతో, ద్విగుణీకృత ఉత్సాహంతో కేసీఆర్ మళ్లీ అత్యంత దూకుడుతో రాజకీయ రణరంగంలోకి దూకడం ఆహ్వానించదగిన పరిణామం.

తెలంగాణ ఉద్యమం, పదేండ్ల పాటు సాగిన ఆదర్శవంతమైన పాలన (కల్లబొల్లి నిందలతో ఎంతగా గత ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నం కొనసాగినా) కేసీఆర్‌కు ఒక వరప్రసాదమై, ఎటువంటి దుర్భర పరిస్థితినైనా ఎదుర్కొనే మానసికస్థైర్యాన్ని కల్పిస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

కేసీఆర్ నెలకొల్పిన మైలురాళ్లు అటు ఉద్యమంలో ఇటు రాష్ట్ర పాలనలో గత 70 ఏండ్లలో ఎవరూ ఊహించనివి. ఆయన అమలు చేసిన నవ్య ప్రణాళికలు, ప్రజా సంక్షేమానికి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు కాల పరీక్షలో చిరస్థాయిగా నిలిచేవే. బీఆర్ఎస్ కూలిపోతుందని మానసిక వికారాల్ని ప్రచారాల్లో ఉంచి, తమ రాజకీయ స్వలాభం కోసం పరితపిస్తున్న నేతలు తమ తమ రాజకీయ వేదాంతం, తాత్విక పునాదులు ఎంత బలంగా ఉన్నాయో ఆలోచించుకోవాలి. సవాలక్ష కుంభకోణాలతో, రాజకీయ మనుగడ కోసం భారత రాజకీయం ఎంతగా బరితెగించిందో, ఎన్ని దుష్ట సంప్రదాయాలకు ఆలవాలమైందో విజ్ఞులైన మేధావులు ఆలోచించాలి. గత 70 ఏండ్లలో వివిధ పార్టీల పాలనలో ఆయా ప్రభుత్వాలు సాధించిన అభివృద్ధి ఫలాల కంటే వారు నాటిన విష బీజాలే ఎక్కువన్న విషయం నిజం కాదా? ఆ విషబీజాలే దేశాన్ని నేడు పీడిస్తున్న దురవస్థకు కారణం కాదా?

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో మేధావుల ముసుగులో ఉన్న కొందరు గతాన్ని మరిచి, రొడ్డకొట్టుడు విమర్శలనే నిరంతరం విశదీకరిస్తూ, విశ్లేషిస్తూ, ఘోషించడం సరైనదేనా? శాశ్వత ప్రమాణాలైన తెలంగాణ ఉద్యమ స్వరూపం, స్వరాష్ట్రం సాధించిన ప్రగతిని నిర్లక్ష్యం చేస్తూ, తెలంగాణ వ్యతిరేకులకు వంతపాడటం అభిలషణీయమేనా? పదేండ్లుగా అభివృద్ధి ఫలాల్ని అనుభవిస్తూ, వేనోళ్ల కీర్తిస్తున్న తెలంగాణీయుల వేదనను అర్థం చేసుకోరా? నేడు ప్రజలు అనుభవిస్తున్న అరాచకీయం, ప్రగతి శూన్యత కండ్లకు కనిపిస్తూనే ఉన్నది కదా! వ్యక్తిత్వ హననం, వెగటు పుట్టించే దూషణల పర్వంపై ఎవరూ స్పందించరేం? జాతి లేదా రాష్ట్ర భవితవ్యాన్ని తీర్చిదిద్దే దిశగా మేధావులు, చింతనాపరులు దిశానిర్దేశం చేయకపోతే వారి మేధోసంపదకే కళంకం కాదా? విజ్ఞులారా ఆలోచించండి!

ఎద్దేడ్శిన ఎవుసం.. రైతేడ్శిన రాజ్యం బాగుపడదని పెద్దలు అంటుంటారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఈ సామెతను నిజం చేసి చూపించాయి. స్వతంత్ర భారత్‌లో అత్యధిక కాలం పాటు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్సే. ఉమ్మడి ఏపీలో తెలంగాణ ఎవుసాన్ని ఆగం చేసిన ఆ పార్టీ.. అది సరిపోదన్నట్టు మరోసారి తెలంగాణను ఎండబెట్టేందుకు కంకణం కట్టుకున్నది. దశాబ్దాల పాటు రైతులను గోస పెట్టిన హస్తం పార్టీ మరోసారి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తెలంగాణలో కరువు, కాటకాలను కోరి తీసుకొచ్చింది. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కర్షకులపై కక్ష గట్టినట్టు వ్యవహరిస్తుండటం బాధాకరం.

ఎంతైనా మనోడు మనోడే

మేడిపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి
96151 46666

జలాలను పొలాలకు మలిపితే సిరులు పండుతాయనే విషయాన్ని మరిచిన కాంగ్రెస్ సర్కార్ రైతులను కష్టాలపాలు చేసింది. నీళ్లివ్వలేమని చేతులెత్తేసింది. పంటపొలాలు తడవాలంటే రైతన్నలు ఆకాశం వైపు చూసే దుస్థితిని తీసుకొచ్చింది. నాడు ఉమ్మడి ఏపీలో తెలంగాణ రైతులు ఎలా గోస పడ్డారో.. సరిగ్గా నేడు కూడా అలాంటి పరిస్థితే దాపురించింది. నాటి మన రైతుల గోసను చూడలేక ఎందరో కవులు గళమెత్తారు. 'నిలిచి కురిసే వాన లేక నిండి పారే చెరువులు ఎండే' లాంటి పాటలు అప్పటి పరిస్థితులను కండ్లకు కట్టేవి. వాన పడితే నీరు నిలవలేని దుస్థితి అప్పటిది. వాన పడ్డా నీటిని నిల్వ చేసుకునేందుకు చెరువులు లేని పరిస్థితి. ప్రాజెక్టుల నిర్మాణం పేరిట అప్పటి కాంగ్రెస్ సర్కార్ కాలయాపన చేసిందే తప్ప తట్టెడు మట్టి ఎత్తింది లేదు. పంటచేల కాడికి నీళ్లను చేర్చింది లేదు. ఏండ్ల తరబడి ఎవుసానికి నోచుకోని పొలాలు బీడుగా మారేవి. దీంతో పంటచేలు అనే పదాన్నే రైతన్న మర్చిపోయే దుస్థితి ఏర్పడింది.

ఎంతో కష్టపడి కాస్తోకూస్తో సాగు చేస్తే నకిలీ విత్తనాల బెడద తప్పేది కాదు. ఎరువుల కోసం ఎర్రటి ఎండలో నిలబడలేక చెప్పులు లైనులో పెట్టి ఎదురుచూడాల్సి వచ్చేది. ఆడనో ఈడనో పడిగాపులు గాసి ఎరువులు దొరకబడితే.. పురుగుల కంటే ముందే కల్తీ ఎరువులు, పురుగుమందులు పంటను మింగేసేవి. ఆరుగాలం శ్రమించినా పంట చేతికందని రైతన్నకు పొలం గెట్టున ఉండే మర్రిచెట్టే యమపాశమయ్యేది. దాని ఊడలే ఉరితాళ్లుగా మారి రైతన్న ఉసురు తీసేది.

అంతటి విపత్కర పరిస్థితుల నుంచి బయటపడ్డ అన్నదాతలు స్వరాష్ట్రంలో పదేండ్ల పాటు కాలు మీద కాలేసుకొని సక్కనైన తెలంగాణను సాగు చేశారు. తమ బతుకులను బాగు చేసుకున్నారు. ఎవరి కన్ను పడిందో తెలియదు కానీ, కాంగ్రెస్ పాలనలో నాలుగు నెలల్లోనే తెర్లయ్యింది. సాగుకు నీళ్లియ్యక, కరెంటు ఇయ్యక, పెట్టుబడి సాయం ఇయ్యక, పంటకు మద్దతు ధర ఇయ్యక, రైతన్న బతుకుకు భరోసా ఇయ్యక కాంగ్రెస్ సర్కార్ రైతాంగం ఉసురు తీస్తున్నది. కాంగ్రెస్ చెప్పినట్టే.. మల్ల ఆనాటి రోజులు గుర్తుకు రావట్టె.

ఇక బీజేపీ సంగతి సరేసరి. 2014 ఎన్నికల్లో ఎట్లయినా విజయం సాధించాలనుకున్న బీజేపీ.. ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేస్తామని నమ్మబలికి రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచింది. 2022 నాటికి రైతుల ఆదాయం రెండింతలు చేస్తామని గప్పాలు కొట్టిన మోదీ.. అందుకు విరుద్ధంగా తన మిత్రుడు అదానీ ఆదాయాన్ని పెంచేందుకు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చారు. అవి తమ మెడకు ఉరితాళ్లుగా మారుతాయని, వాటిని రద్దు చేయాలంటూ అన్నదాతలు ప్రాణత్యాగం చేయాల్సి వచ్చింది. ఆనాడు రైతన్నలకు దన్నుగా కాదు, కదా కనీసం సంఘీభావం కూడా ప్రకటించలేదు కాంగ్రెస్. ఢిల్లీ సరిహద్దుల్లో పోరాడుతున్న రైతాంగానికి మద్దతు తెలిపింది కేసీఆర్ ఒక్కరే.

కష్టనష్టాలకోర్చి సాగు చేస్తున్న కర్షకులను ఆదుకోవాల్సిందిపోయి బాయికాడ మోటర్లకు మీటర్ల పేరిట రైతన్నల ఉసురు తీయాలని చూసింది బీజేపీ సర్కార్. ఎవుసంలో కొత్త ఒరవడిని సృష్టించి రికార్డు స్థాయిలో తెలంగాణ రైతులు ధాన్యం పండిస్తే.. వాటిని సేకరించాల్సింది పోయి నూకలు తినాలంటూ అవహేళన చేశారు కేంద్ర పాలకులు. వ్యవసాయం పట్ల ఈ రెండు జాతీయ పార్టీల విధానం ఒక్కటే. అరిగోస పెట్టి రైతన్నల ప్రాణాలు తీయడమే.

తెలంగాణ పునర్నిర్మాణ ఆశయమే రైతును రాజును చేయడం. 'కంపతారు చెట్లు కొట్టి అమ్ముకునే కాలమొచ్చెరా సేతా నమేడుందిరా తెలగాణ సేలన్ని బీడాయెరా' అని పాడుకునే కాడి నుంచి ధాన్యపు రాశులను పండించే స్థాయికి తెలంగాణను చేర్చింది కేసీఆర్ సర్కారే. భూముల విలువ పెంచింది కేసీఆర్ ప్రభుత్వమే. నీళ్లకు నడక నేర్పితే సిరులు పండుతాయని నిరూపించింది కేసీఆరే. నీళ్లను నిల్వ ఉంచాలనే తలంపుతో ఆనాటి కాకతీయ రాజుల ఆలోచనను ఆదర్శంగా తీసుకున్న కేసీఆర్.. మిషన్ కాకతీయ ద్వారా గొలుసుకట్టు చెరువుల నిర్మాణం, పునర్నిర్మాణం చేశారు. కొత్త ప్రాజెక్టులను నిర్మించి, అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేసి తెలంగాణకు జలాభిషేకం చేశారు. ఆయన కృషి వల్లనే 'వాగు ఎండిపోయెరా పెదవాగు ఎండిపోయెరా కడుపుల పేగు ఎండిపోయెరా' అని పాడుకునే కాన్నుంచి.. 'వాగు నిండిపోయెరా పెదవాగు నిండిపోయెరా కడుపు సల్లగా ఉండిపోయెరా' అని పాడుకునే కాడికి వచ్చినం.

నీళ్లు నిలిస్తే సరిపోదు, ఆ నీళ్ల సరఫరాకు నిరంతర విద్యుత్తు ఉండాలని 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇచ్చారు. నీళ్లు, కరెంట్ ఇస్తే సరిపోదని భావించి.. రైతన్న ఓ అయ్యకాడికో, షావుకారి కాడికో పోకూడదని దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుబంధు ఇచ్చారు కేసీఆర్. ప్రమాదవశాత్తు మరణించే రైతుల కుటుంబాలకు రైతుబీమాతో భరోసా ఇచ్చారు. సాగుకు నీళ్లిచ్చి, పెట్టుబడి సాయమిచ్చి, కరెంటిచ్చి, సకాలానికి ఎరువులు ఇచ్చి, నీటి తీరువా రద్దు చేసి.. దండుగన్న వ్యవసాయాన్ని పండుగలా మార్చారు.

పొరపాటునో, గ్రహపాటునో ఆ పాత రోజులు మళ్లీ వచ్చాయి. ఉమ్మడి పాలన నాటి నిర్లక్ష్యపు జాడలు దాపురించాయి. విధ్వంసం మొదలైంది. గత తొమ్మిదిన్నరేండ్లలో సృష్టించిన సంపద కొంతైనా సురక్షితంగా ఉండాలంటే ప్రశ్నించే గొంతుక మనదే అయి ఉండాలే. తెలంగాణను కడుపులో పెట్టుకొని చూసుకునేది కేసీఆరే. పెద్దలు చెప్పినట్టు ఎట్టికైనా, మట్టికైనా మనోడు ఉండాలే. ఇక్కడైనా, ఢిల్లీ అయినా మనోడే మన కోసం మాట్లాడుతడు, పోట్లాడుతడు. తెలంగాణ మాట పార్లమెంట్‌లో వినిపించాలంటే మనోడు ఉండాలే. మన గొంతు ఉండాలే. అది కేసీఆర్ గొంతు అయి ఉండాలే.



బెంగాల్‌లో 'ఇండియా' లేదు!

పశ్చిమబెంగాల్‌లో ఇండియా కూటమి లేనేలేదు. సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీలు బీజేపీతో చేతులు కలిపాయి. బీజేపీ గెలుపు కోసమే ఆ పార్టీలు పనిచేస్తున్నాయి. అందుకే కమలం పార్టీని ఓడించాలనుకునేవారు సీపీఐ(ఎం), కాంగ్రెస్‌లకు ఓట్లు వేయవద్దు.

- మమతా బెనర్జీ,
పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

ఎటమటం

ముందే చెప్పాలి కదా!

'ముందే చెప్పాలి కదా' సోషల్ మీడియాలో ఈ మధ్య బాగా పాపులరైన డైలాగ్ ఇది. సినీ నటి సమంత ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలివీ. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా అచ్చం ఇదే డైలాగే చెప్తున్నారట. 'మోత్కుపల్లి నరసింహులును మేము ఇక్కడ పార్టీలో చేర్చుకోకపోతే మీ వద్దకు వచ్చి కండువా కప్పుకున్నారు. ఇప్పుడేమో ఆయన ఇక్కడ మాదిగలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందంటూ పెంట.. పెంట చేస్తున్నారు' అని రాష్ట్ర నాయకుడు ఒకరు శివకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో 'మోత్కుపల్లి అలాంటివాడని నాకు ముందే చెప్పాలి కదా' అని డీకే ప్రశ్నించారట!

మీ టికెట్ మీ ఇష్టం

'ఊరంతా ఒక మాట... ఉలిపి కట్టెది ఒక మాట' అన్నట్టుగా ఉన్నది ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నేతల వ్యవహారం. ఎంపీ ఎన్నికలు ముగిసేవరకు మంత్రులు తమకు అప్పగించిన జిల్లాలోనే ఉండాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశాలు జారీ చేశారు. కానీ, తన భార్యకు టికెట్ రాలేదని భట్టి విక్రమార్క ఇంచార్జి బాధ్యతల నుంచి తప్పుకోగా, తన కుమారుడికి టికెట్ రాలేదని తుమ్మల నాగేశ్వరరావు మల్కాజిగిరి ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టారు. ఇక మిగిలిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాత్రమే ఖమ్మం జిల్లాకు పరిమితమయ్యారు. 'మా కుటుంబ సభ్యులకు టికెట్ రానప్పుడు మాకెందుకు ఆ శ్రమ, మీ కుటుంబసభ్యులకు టికెట్ ఖాయమైంది కాబట్టి ఆ పాట్లేవో మీరే (పొంగులేటి) పడండి' అని భట్టి, తుమ్మల ఏ టెన్షన్ లేకుండా తిరుగుతున్నారట.

సరిపోయారిద్దరు..!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కరీంనగర్ జిల్లాలో ఆ పార్టీ నాయకులకు పట్టపగ్గాలు లేకుండాపోయాయని విమర్శలు వస్తున్నాయి. అక్కడ వారి చర్యలు, మాటలు సోషల్ మీడియాలో నిత్యం సీరియల్‌గా వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలోనే మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సొంతపార్టీ కార్యకర్తపై దాడిచేసిన ఘటన వైరలైంది. ఇది పార్టీ పెద్దల దృష్టికి కూడా వెళ్లింది. అలా చేయడం తప్పని చెప్పకుండా ఎన్నికలు అయ్యేదాకా సంయమనం పాటించాలని పార్టీ పెద్దలు సూచించినట్టు సమాచారం. సరిపోయారిద్దరు..!

గెలిపిస్తే మంత్రి గ్యారెంటీ..!

నా పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారిందని కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లోలోన మదనపడుతున్నారట. సీఎం రేవంత్‌రెడ్డి తన శిష్యుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డికి టికెట్ ఇచ్చి, గెలుపించుకొచ్చే బాధ్యత ఆయనకు అప్పగించారు. అట్లయితేనే మంత్రి పదవికి సీఎం గ్యారెంటీ ఇచ్చారట. రాష్ట్ర ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలకే దిక్కులేదంటే.. ఈ ఏడో గ్యారెంటీ ఎప్పటికి అమలయ్యేనో అని గాంధీ భవన్‌లో కొందరు కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేస్తున్నారట!

- వెల్జాల